సాక్షి శ్రీకాకుళం

శనివారం । 5 । ఆగస్టు । 2023



వ్యాక్సిన్లు భద్రం

మూగజీవాల మందులు భద్రపరిచేందుకు కూలర్లు వచ్చేశాయి. వీటితో వ్యాక్సిన్లూ భద్రంగా ఉంటాయి.

- 8లో



వేర్వేరు చోట్ల నదుల్లో పడి..

పాతపట్నం, గార మండలాల్లో నదుల్లో పడి ఇద్దరు మృతి చెందారు. ఆయా గ్రామాల్లో విషాదం నెలకొంది.

- 8లో

'కాపునేస్తంకు దరఖాస్తు చేసుకోండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు సంబంధించిన మహిళలకు అందజేసే కాపునేస్తం పథకంలో భాగంగా ఈ విడతకు సంబంధించి దరఖాస్తుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ గ్రామ వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయంతో నిర్వహించాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 5428 దరఖాస్తులు వచ్చాయని, ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

అంపోలు పీఏసీఎస్‌కు ప్రథమ స్థానం



మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న గొండు కృష్ణమూర్తి

గార: శ్రీకాకుళం డీసీసీబీ పరిధిలో 2022–23 సంవత్సరానికి గాను జిల్లాస్థాయిలో అంపోలు పీఏసీఎస్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సహకార బ్యాంకు వజ్రోత్సవాల సందర్భంగా విజయవాడ సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చేతులమీదుగా అంపోలు పీఏసీఎస్ అధ్యక్షుడు, ప్రస్తుత డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సీఈఓ గొండు అచ్చెన్నాయుడు అవార్డుతో పాటు రూ.50వేలు క్యాష్ రివార్డు అందుకున్నారు. పాలక మండలి సభ్యులు, రైతులు, సిబ్బంది సహకారంతోనే ప్రథమ స్థానం సాధించగలిగామని గొండు కృష్ణమూర్తి అన్నారు.

ఆట్యా పాట్యా జిల్లా జట్ల ఎంపికలు రేపు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 6న ఆదివారం ఉదయం 9 గంటలకు ఆట్యా పాట్యా జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆట్యా పాట్యా జిల్లా అసోసియేషన్ కోఆర్డినేటర్ బాడాన నారాయణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2006 సంవత్సరానికి ముసుపు జన్మించిన బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. వయసు, బరువు, ఎత్తు విభాగంలో బాలురుకు 260 పాయింట్లు ఉండాలని, బాలికలకు 240 పాయింట్లు ఉండాలని తెలిపారు. ఆధార్‌తో పాటు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఎంపికలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 19, 20 తేదీల్లో కర్నూలులో జరగనున్న అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని నారాయణరావు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి నాగ్‌పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 8500007272 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి: ఎస్పీ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు విధి నిర్వహణలో మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం పోలీసులు ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎస్పీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పంద్రాగస్టు వేడుకల్లో ఆకట్టుకునేలా పరేడ్ నిర్వహించాలన్నారు. అనంతరం సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ట్రాఫిక్ పోలీసుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వర్, తిప్పేస్వామి, డీఎస్పీలు శృతి, బాలరాజు, ప్రసాదరావు, విజయ్‌కుమార్, వాసుదేవ్, ప్రసాదరావు అధికారులు పాల్గొన్నారు.

'మౌలిక వసతుల కల్పనే లక్ష్యం'



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని రాష్ట్ర చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను శుక్రవారం సందర్శించి వసతి గృహాలు, అకడమిక్ బ్లాక్, మెస్ పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది విద్యార్థులకు వసతి సిద్ధం చేయాలని అన్నారు. రెండో కౌన్సెలింగ్ ఈ నెల 9, 10 తేదీల్లో జరుగుతుందని, విద్యార్థులు 11న సీట్లు లభించిన క్యాంపస్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న భవనాలు కాంట్రాక్టు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రూ.5.20 కోట్లతో నిర్మించనున్న వసతి నివాస సముదాయం పనులు త్వరితగతిన ప్రారంభించాలన్నారు.

● గంపగుత్తగా ముంచేశాడు..

రూ.5కోట్లకు టోపీ.. ఆపై ఐపీ



- ఉద్యోగాలు, చీటీ పాటలు, రియల్ ఎస్టేట్ పేరిట రూ.5కోట్లకు పైగా ఎగనామం
- తెలిసిన వారికే కుచ్చుటోపీ పెట్టిన షేక్ అమిత్
- ఐపీ పెట్టి పారిపోయిన వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అతను తరతమ బేధాలు చూడలేదు. స్నేహితులు, బంధువులు అందరినీ మోసం చేశాడు. రైల్వేలో ఉద్యోగాల పేరిట కొందరిని, చీటీ పాటల పేరిట ఇంకొందరిని, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరిట మరికొందరిని నమ్మించి నట్టేట ముంచాడు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా రూ.5కోట్లకు పైగా వసూలు చేసి, శ్రీకాకుళం నగరానికి చెందిన షేక్ అమిత్ అనే యువకుడు టోపీ పెట్టేశాడు. సొంత బంధువుల వద్ద కూడా చేబదులంటూ సర్వం దోచేశాడు. అంతటితో ఆగలేదు. మోసం పోలీసుల దృష్టి వరకు వెళ్లిందని 23 మందికి రూ.కోటి 88లక్షలకు ఐపీ నోటీసులు పంపించి పరారయ్యాడు. బాధితుల కథనం ప్రకారం..

శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేట, తోటపాలెం తవిటయ్య చేరికి చెందిన షేక్ అమిత్ చాలా తెలివిగా మోసాలకు పాల్పడ్డాడు. తన అన్న మెడికల్ రిప్రజెంటేటివ్ కావడం, ఆయనకు మరికొందరు రిప్రజెంటేటివ్‌లతో పరిచయాలుండటంతో వారందరినీ గంపగుత్తగా మభ్యపెట్టి మోసాల ఉచ్చులోకి లాగాడు.

తొలుత రైల్వేలో జాబులిప్పిస్తానని హామీ ఇవ్వడంతో 16మంది డబ్బులు కట్టారు. ఒక్కొక్కరి నుంచి రూ.5లక్షలు వరకు వసూలు చేశాడు. ఈ లెక్కన రైల్వే ఉద్యోగాల కింద రూ.కోటి వరకు వసూలు చేశాడు. వాళ్లకు ఉద్యోగాలూ ఇవ్వలేదు, తీసుకున్న డబ్బూ వెనక్కి ఇవ్వలేదు. మరికొంతమందికి చీటీ పాటలంటూ మొదట్లో నమ్మకం కలిగేలా నిర్వహించి, భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశాక చేతులెత్తేశాడు.






మోసపోయిన బాధితులు

బాధితులు సంప్రదించారు..

షేక్ అమిత్‌కు అప్పులు ఇచ్చామంటూ బాధితులు మా వద్దకు వచ్చిన మాట వాస్తవం. మోసం చేశాడని భావిస్తున్న అతడిని పిలిపించి మాట్లాడుతామని వారికి చెప్పాం. అలా కూడా కుదరకపోతే కోర్టు ద్వారా తేల్చుకోవాలని సూచించాం.

– పప్పుల శ్రీనివాసరావు, సీఐ, రెండో పట్టణ పోలీస్ స్టేషన్

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్రావుకు బాధితులు అందజేసిన ఫిర్యాదు కాపీ



ఇంకొందరి నుంచి రణస్థలంలో లేఅవుట్‌లు వేస్తున్నాం.. నేను ఫలానా అతనితో పార్ట్‌నర్‌నంటూ.. ఆ ప్రాంతాలకు తీసుకెళ్లి మంచి విందు భోజనం పెట్టించేవాడు. రియల్ ఎస్టేట్‌లో మీరు పెట్టుబడులు పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని నమ్మబలికాడు. ఆశ పడిన బాధితులు తమ కష్టార్జితాన్ని, దాచుకున్న సొమ్మును అమిత్ చేతులో పెట్టేశారు. ఇలా అన్ని రకాలుగా రూ.5కోట్లకు పైగా వసూలు చేసి జనాల్ని మోసగించాడు.

బాధితులు వీరే..

శ్రీకాకుళానికి చెందిన ప్రసాదుల రవికుమార్ (పాలిటెక్నిక్ దరి టైల్స్‌షాపు ఓనరు) తన అక్కలిద్దరి పేరిట రూ.18 లక్షలు, కోరాడ రంజిత్‌కుమార్ (శ్రీకాకుళం నగరం) రూ.65 లక్షలు, ఈయన హామీగా 15 మంది రూ. కోటి వరకు అమిత్‌కు ఇచ్చారు. మెండ చంద్రశేఖర్ (పీఎన్ కాలనీ) హామీగా 10 మందికి సంబంధించి రూ.70 లక్షలు, పాట్నూరి రవికుమార్ (ఓల్డ్ నవభారత్ జంక్షన్) హామీగా ఎనిమిది మందికి సంబంధించి రూ.15 లక్షలు, వరసకు బావ అయిన షేక్ మదీనా, ఈయన మధ్యవర్తిత్వంతో మరో 12 మందికి సంబంధించి రూ.80 లక్షలు, మహ్మద్ రఫీ (కత్తెరవీధి) రూ.7లక్షలు, రిటైర్డు ఏఎస్ఎం లొడ్డి అప్పాయమ్మ రూ.26 లక్షలు, పాట్నూరు వాసు (టూటౌన్ పీస్ దరి) రూ.30 లక్షలు, కర్రి లక్ష్మణరావు (రాజీవ్ గృహకల్ప, వాంబేకాలనీ) హామీగా ఇద్దరి నుంచి రూ.13 లక్షలు, దూబ శ్రీనివాసరావు (తోటపాలెం) నుంచి రూ.14 లక్షలు, కల్లివరపు చంద్రశేఖర్ (బలగ) హామీగా ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.15 లక్షలు, మహ్మద్ మున్నా (జిల్లాపరిషత్), కె.తిరుపతిరావు(నీలమ్మకాలనీ), ఆటో ఈశ్వరరావు (పీఎన్‌కాలనీ), కె.కమల, ఎఎస్ఎం (నవభారత్)లు రూ.ఐదేసి లక్షలు చొప్పున ఇచ్చేశారు. వీరిలో ఒకరిద్దరు బ్యాంకింగ్ ద్వారా, ఫోన్ పేద్వారా పంపినా మిగతా వారందరూ ప్రామిసరీ నోట్లు, చెక్కుల ష్యూరిటీ మీద నేరుగా నగదు ఇచ్చారు. రైల్వే ఉద్యోగాలని, చీటీ పాటలని, రియల్ ఎస్టేట్ పెట్టుబడి అని, అధిక వడ్డీ అని ఎర చూపి వీరందరి నుంచి వసూలు చేశాడు. డబ్బులు ఇచ్చిన చాన్నాళ్ల తర్వాత తాము మోసపోయామని తెలియడంతో బాధితులంతా రోడ్డెక్కారు. నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. వీరంతా ఫిర్యాదు చేశారన్న విషయం తెలియగానే మోసాలకు పాల్పడిన అమిత్ మరో ఎత్తుగడకు తెరలేపాడు. నష్టపోయానంటూ 23మందికి రూ.కోటి 89లక్షల మేరకు ఐపీ నోటీసులు పంపించాడు. దీంతో ఆయన్ని నమ్మి డబ్బులు కట్టిన వారంతా అవాక్కై మోసం చేయడమే కాకుండా ఐపీ ముసుగులో బరితెగించేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా సొమ్ము ఇస్తానంటూ..



రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాను.. దానికి డబ్బులు అవసరం. మీరు రూ.10 లక్షలు ఇస్తే.. మూడు నాలుగు నెలల్లో అధిక వడ్డీతో రూ.5 లక్షలు కలిపి ఇస్తానని మాయమాటలు చెప్పాడు. నేను మా ఇద్దరి అక్కలతో రూ.18 లక్షల వరకు ఇచ్చాను. అసలూ లేదు.. వడ్డీలేదు.. ఐపీ నోటీసు మాత్రం వచ్చింది. నగరంలో రూ.80 లక్షల స్థలం మా డబ్బులతో కొన్నట్లు ఆధారాలున్నాయి.

– ప్రసాదుల రవికుమార్, సాయి ఈశ్వరి టైల్స్ షాపు యజమాని

రూ.1.65 కోట్లు ఇచ్చాం..



జాబులిప్పిస్తామని.. సైటుల్లో ఇన్వెస్టు చేస్తామని.. చీటీల పాటని అని చెప్పి నా వద్ద వ్యక్తిగతంగా రూ.65 లక్షలు తీసుకున్నాడు. నా హామీతో 15 మంది రూ. కోటి వరకు ఇచ్చారు. మా డబ్బులతో అతని సోదరుడు పేరున ఉడాలో మూడున్నర సెంట్లు స్థలం కొన్నాడు. అతని పేరుతోనే విశాఖలో మెడికాన్ పేరుతో రూ. కోటి వ్యయంతో సర్జికల్ బిజినెస్ పెట్టాడని తెలిసింది.

– కోరాడ రంజిత్‌కుమార్, శ్రీకాకుళం టౌన్

చీటీల పాట వేస్తానంటూ..



చీటీల పాట వేస్తానంటూ మా వద్ద డబ్బులు వసూలు చేసి సైట్ల కు పెట్టుబడులంటూ రణస్థలం ఏరియాల్లో తిప్పేవాడు. నా వద్ద ఇప్పటివరకు రూ.7 లక్షల వరకు వసూలు చేశాడు. ఎంతో కష్టపడి దాచుకున్న సొమ్ము ఇలా దోచేశాడు. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు ఇవ్వడంతో తప్పించుకోవడానికి ఐపీ నోటీసులు పంపాడు. – మహ్మద్ రఫీ, కత్తెర వీధి

దగ్గర బంధువే ముంచాడు..



మా సొంత పిన్ని కుమార్తెతో అమిత్‌కు వివాహం జరిగింది. ఇల్లు కడుతున్నాం.. చేబదులుగా ఇవ్వండంటూ రూ. 80 లక్షల వరకు నొక్కేశాడు. నన్ను నమ్మి 12 మంది డబ్బులు ఇచ్చారు. ఇంటి అల్లుడంటూ మర్యాద ఇస్తే.. ఐపీ నోటీసులు పంపి మమ్మల్ని రోడ్డు మీదకు లాగాడు. – షేక్ మదీనా, పీఎన్ కాలనీ

సంక్షేమంలో రాజకీయాలుండవు

- ప్రాధాన్యత భవన నిర్మాణాలు వేగవంతం చేయండి
- అర్హులకు లబ్ధి అందకపోతే స్థానిక నేతలు చొరవ చూపాలి
- ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

అరసవల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిలో రాజకీయాలకు తావు లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. హౌసింగ్ విషయంలో కూడా రెవెన్యూ అధికారులకు, హౌసింగ్ అధికారుల మధ్య సమన్వయం లేదని తెలుస్తోందన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రతిపక్షాల తీరుతో అభివృద్ధి పనులకు ఆటంకం వస్తే చట్ట ప్రకారం ప్రత్యేకాధికారులతో తీర్మానాలు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో తలెత్తిన కోర్టు కేసులపై నాలుగు మండలాల తహసీల్దార్లతో పలాస ఆర్డీవో సమీక్షించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే మన జిల్లా రెండోస్థానంలో నిలిచిందన్నారు. ఇచ్ఛాపురం, సోంపేటలో డయాలసిస్ సెంటర్ల ఏర్పాట్లపై ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలోనే చేపట్టేలా చర్యలుంటాయని ప్రకటించారు. ఇక ఉద్దానంలో పనిచేసే వైద్యులకు ప్రత్యేక అలవెన్స్ ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఇది కూడా త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు.



పాల్గొన్న నాయకులు, అధికారులు

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ కీలక వైద్యులు ఇక్కడ పనిచేయడానికి విముఖత చూపుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని మంత్రికి విన్నవించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సచివాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా బదిలీలు చేసుకుని వెళ్లిపోవడంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిష్కరించాలన్నారు.
- ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ తిత్లీ తుపాను కారణంతో ఉద్దానంలో కొబ్బరి చెట్లు కోల్పోయిన రైతుల కోసం 5 లక్షల కొబ్బరి చెట్లను ఉచితంగా ప్రభుత్వం తరపున ఇప్పించాలని కోరారు.
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ పెట్టేందుకు స్థలం ఉందని పరిశీలించాలని కోరారు. అలాగే పైడిగాం సాగునీటి ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తే సాగునీటి సమస్య తగ్గుతుందన్నారు. అలాగే బెంతొరియా కులస్తుల సమస్యలను కూడా పరిష్కరించాలని మంత్రి బొత్సను కోరారు.
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ, హౌసింగ్ శాఖలు ఈ నెలాఖరులోగా చెప్పిన పనులు చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దానం ప్రాంతంలో పనిచేసేందుకు వైద్యులు ముందుకు రావడం లేదన్నది వాస్తవమని, అందుకే ప్రభుత్వం తరపున స్థానికులెవరైనా వైద్యార్హతతో పనిచేస్తామని ముందుకు వస్తే.. వెంటనే వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తామని ప్రకటించారు.
- ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో ఇబ్బందులున్నాయని అన్నారు. మున్సిపల్ పరిధిలో కొందరు పేదలకు పట్టాలిచ్చామని, అయితే ఆ లేఅవుట్ స్థలం కోర్టులో ఉందని, ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే టిడ్కో ద్వారా ఇళ్ల కోసం మున్సిపల్ పరిధిలో గతంలో వసూలు చేసిన మొత్తాలని తిరిగి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. వీటిపై మంత్రి బొత్స సానుకూలంగా స్పందించారు.
- కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు విషయంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు జోక్యంతో నిర్మాణ పనులను ఆపేస్తున్నారని, దీంతో మా పరిధిలో సెల్‌సిగ్నల్స్ రాక 108కి కూడా ఫోన్లు చేసుకోలేకపోతున్నామని సర్పంచ్ సుమన్ మంత్రి బొత్స దృష్టికి తీసుకెళ్లారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, చీఫ్ ప్లానింగ్ అధికారి లక్ష్మీప్రసన్న, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, డీపీఓ రవికుమార్, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ బయ్యన్నాయుడు, డ్వామా పీడీ చిట్టిరాజు, నియోజకవర్గ మండల జెడ్పీటీసీలు యశోద, లోలాక్షి, నారాయణమ్మ, ఎంపీపీలు బోర పుష్ప, డాక్టర్ నిమ్మన దాసు, దేవానందరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని రెగ్యులర్ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. 11894 మంది పరీక్ష రాయగా, 4585 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 38.55గా నమోదైంది. బీఏలో 1646 మందికి 613 (37.24 శాతం), బీబీఏలో 169 మందికి 115 (68.05 శాతం), బీసీఏలో 167 మందికి 123 (73.65 శాతం), బీకాంలో 1940 మందికి 556 (28.66 శాతం), బీఎస్సీలో 7972 మందికి 3178 (39.86) ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా చేసుకోవాల్సి ఉంటుంది. కళాశాలలకు మార్కుల జాబితాలు పంపించనున్నారు.

కోటిపల్లి సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

పొందూరు: మండలంలోని కోటిపల్లి సచివాలయం కార్యదర్శి బి.రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో నిధులను, ఇంటి పన్ను వసూళ్లను సొంత అవసరాలకు వినియోగిస్తూ దుర్వినియోగం చేసినట్లు సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మే 22న శ్రీకాకుళం డీఎల్‌పీఓ విచారణ జరిపారు. నిధుల దుర్వినియోగం వాస్తవమని తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయని ఎంపీడీఓ సీపాన హరిహరరావు తెలిపారు.

● సాగు యోగం



నారు తీత జోరుగా సాగుతోంది. శుభ ముహూర్తాల్లో ఉభాలు జరుగుతున్నాయి. నీరు నిండిన పొలాల్లో దుక్కులు చక్కగా అవుతున్నాయి. శ్రీకాకుళం సమీపంలోని పొలాల్లో ఖరీఫ్ పనులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం









క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ప్రకాశం కలెక్టర్



కలెక్టర్ దినేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ వివరించారు. ఆదిత్యుని దర్శనం సంతృప్తినిచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి.. పింఛన్ అందించి..



పింఛన్ అందిస్తున్న వలంటీర్ రజని

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన బలగ అప్పలనాయుడు కంటి సంబంధిత సమస్యతో విశాఖపట్నం కేజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకుని చికిత్సపొందుతున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామవలంటీర్ కిల్లి రజని శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి దివ్యాంగ పింఛన్ అందించి ఆసరాగా నిలిచారు.

కొత్తూరు-టెక్కలి బస్సు సర్వీసుపై హర్షం



టెక్కలి నుంచి కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన బస్సు

కొత్తూరు: టెక్కలి నుంచి కొత్తూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ కొత్తూరు మండలం కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, పంకజదాస్, వనుము లక్ష్మీనారాయణ, మఠం పూర్ణ, కృష్ణమోహన్, వై.ధర్మారావు తదితరులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత పాతపట్నం నియోజకవర్గం టెక్కలి డివిజన్ పరిధిలోకి వెళ్లడంతో కొత్తూరు నుంచి టెక్కలి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె కలెక్టర్, ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు.స్పందించిన అధికారులు ఈ నెల 2 నుంచి టెక్కలి నుంచి కొత్తూరుకు ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించారు.

పైడి కుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా అశోక్‌కుమార్



కొత్తూరు: పైడి కులం సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొత్తూరు మండలం మహసింగి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నేత పసుపురెడ్డి అశోక్‌కుమార్ ఎన్నికై నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పాలక రాజారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలో గత నెల 30న ఎన్నిక జరిగిందన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ శుక్రవారం ధ్రువపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

కూలర్లు సిద్ధం.. వ్యాక్సిన్లు భద్రం

- మూగజీవాల మందులపై ప్రత్యేక శ్రద్ధ
- వ్యాక్సిన్లు, మందుల కోసం చల్లటి వాతావరణం
- జిల్లాలోని మూడు డివిజన్లలో వాక్ ఇన్ కూలర్లు
- మండల డిస్పెన్సరీల్లో బల్క్ కూలింగ్ మిషన్లు



వెటర్నరీ డిస్పెన్సరీల్లో బల్క్ కూలింగ్ మిషన్

కాశీబుగ్గ: మూగజీవాల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ పేరిట 1962 అంబులెన్సు సేవలు తీసుకొచ్చిన జగనన్న సర్కారు ఆపదలో ఉన్న పశువులకు అత్యవసర వైద్యం అందిస్తూ రక్షణగా నిలుస్తోంది. తాజాగా మూగజీవాల చికిత్సకు అవసరమైన వ్యాక్సిన్లు భద్రపరిచేందుకు వాక్ ఇన్ కూలర్లు సిద్ధం చేసింది. గతంలో వ్యాక్సిన్లు సరైన భద్రతా ఏర్పాట్లు లేక, బయట వేడి వాతావరణం కారణంగా పాడయ్యేవి. ఇప్పుడా పరిస్థితి లేకుండా కూలర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఎలా పనిచేస్తాయి..

వాక్ ఇన్ కూలర్ ఓ చిన్నపాటి గదిలా ఉంటుంది. ఇందులో సుమారు 15 మంది మనుషులు నిలబడే స్థలం ఉంటుంది. ఇందులో 3 డిగ్రీల నుంచి -7 డిగ్రీల సెంటీగ్రేడ్ చల్లదనం ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఏడాది పొడవునా మూగజీవాలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు ఇక్కడ భద్రపరుస్తున్నారు. బ్యాక్టీరియల్, వైరల్, జబ్బవాపు, గొంతువాపు, చిటుకు వ్యాధి, గాలికుంటు వ్యాధి, కోళ్లకు అవసరమైన ఆర్‌డీఎఫ్-01, ఆర్‌డీకే, ఎఫ్‌పీ, గొర్రెలకు పీపీఆర్, స్మాల్ ఫాక్స్, నీలి నాలుక వంటి వ్యాధులకు అవసరమైన ఖరీదైన వ్యాక్సిన్లు భద్రపరుస్తున్నారు. ఇక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిస్పెన్సరీలలో బల్క్ కూలింగ్ మిషన్ ఏర్పాటు చేసి వాటిలో భద్రపరుస్తున్నారు. ఇక్కడి నుంచి అవసరమైనప్పుడు డిస్పెన్సరీలకు మందులు చేరవేస్తారు.

చల్లని సంరక్షణ



జిల్లాకు నూతనంగా వచ్చిన వాక్ ఇన్ కూలర్

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పశువుల ఆస్పత్రులకు వివిధ రకాల వ్యాక్సిన్ సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అరకొరగా వీటిని సరఫరా చేసేవారు. అది కూడా సరిపడ చల్లదనం లేకపోవడంతో వేగంగా పాడైపోయేవి. ఈ సమస్యను అధిగమించేందుకు జగనన్న ప్రభుత్వం వ్యాక్సిన్లు నిల్వచేసే కేంద్రాలపై దృష్టి పెట్టింది. జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసేందుకు వీలుగా ఏడీడీఎల్ ల్యాబ్‌లో మెగా వాక్‌ఇన్ కూలర్ ఉంది. కొత్తగా పలాస, పాతపట్నం, నరసన్నపేట సబ్ డివిజన్‌లో వాక్ ఇన్ కూలర్లు ఏర్పాటు చేశారు. మండలాల్లోని వెటర్నరీ డిస్పెన్సరీకి బల్క్ కూలింగ్ మిషన్లు సైతం సమకూర్చారు.

ఎప్పుడు కావాలంటే అప్పుడు..



కొన్ని వ్యాక్సిన్లు చల్లదనం లేకపోతే పాడైపోతాయి. మూగజీవాలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు పాడవకుండా వాక్ ఇన్ కూలర్‌లో భద్రపరుస్తాం. కాలపరిమితి బట్టి ఎన్ని రోజులైనా మందులు సురక్షితంగా ఉంటాయి. వీటికి అనుబంధంగా పశువైద్యశాలల్లో సైతం బల్క్ కూలింగ్ మిషన్‌లు ఏర్పాటు చేశాం.

– డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు, పశుసంవర్ధక సహాయ సంచాలకుడు, పలాస

పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులు
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదులో ఎక్కడా పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ జాబితాలో చోటు ఉండాలన్నారు. కొత్త ఓటర్లతో పాటు మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి ఎపిక్ కార్డులు మంజూరు చేయాలని సూచించారు. ఇందుకు ఫారం 6, 8లను వినియోగించుకోవాలన్నారు. ఓటర్ల వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లను మార్పునకు ఈఆర్‌ఓ స్థాయిలో అవకాశం ఉంటుందన్నారు. బీఎల్‌ఏలను బీఎల్‌ఓలు కొన్నిచోట్ల వినియోగించడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, ఆ పరిస్థితి ఉండకూడదన్నారు. ఈ ప్రక్రియ ముగిసే వరకు ఎక్కడా వలంటీర్ల పాత్ర ఉండరాదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో సమస్యలు తలెత్తితే ఈఆర్‌ఓ, జిల్లా ఎన్నికల అధికారిని సంప్రదించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్పించాలన్నారు. ఇందుకు సమీపంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఒకే ఇంట్లో 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా, జీరో డోర్ నెంబర్ ఉన్నా జాబితాలను పరిశీలించి ఫారం-8 ద్వారా సవరణలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



కృషి విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న తిరుపాల్ రెడ్డి

ఆమదాలవలస: రైతులు పంటపొలాల్లో ముందస్తుగా భూసార పరీక్షలు నిర్వహించి వాటికి అనుగుణంగా పంటల్లో ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఐ.తిరుపాల్ రెడ్డి అన్నారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కె.వి.కెలో శాస్త్రవేత్తల బృందం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. వ్యవసాయ యంత్రాలను రాయితీపై వ్యక్తిగతంగా కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించాలని అభ్యుదయ రైతులు విన్నవించారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు గుండు రఘురాం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డాక్టర్ సమ నేతాజీ, జిల్లా సంయుక్త వ్యవసాయ అధికారి డాక్టర్ శ్రీధర్, రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



పదోన్నతి పొందిన నూతన హెచ్‌ఎంలను సత్కరిస్తున్న పీనైఈవో, ఒలింపిక్, పీఈటీ సంఘ ప్రతినిధులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో మరింతగా క్రీడలను విస్తరించి విద్యార్థులను ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో జిల్లా పీఈటీ సంఘం, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ క్రీడా వార్షిక క్యాలెండర్‌పై చర్చించారు. స్కూల్‌గేమ్స్, గ్రిగ్స్‌మీట్‌ల నిర్వహణపై సమీక్షించారు. పీడీ-పీఈటీల జాబ్‌చార్ట్‌లపై మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయులకు టీచర్స్ డైరీలను పగడాలమ్మ, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, సంపతిరావు సూరిబాబు, పి.తవిటయ్య, మెట్ట తిరుపతిరావు, శేఖర్‌బాబు, నిర్మల్‌కృష్ణ, జగదీష్, సురేష్, రవి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సత్కారం..

వ్యాయామ ఉపాధ్యాయులుగా రెండు దశాబ్దాలుగా సేవలు అందించిన ఎమ్మెస్సీ శేఖర్, వై.పోలినాయుడు, కె.హరిబాబు, ఎం.కూర్మినాయుడు, జి.రాము ఇటీవలి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. వీరిని పీడీ, పీఈటీలు ఘనం

మత్స్యకార కుటుంబాలకు మంత్రి సీదిరి పరామర్శ



మత్స్యకార కుటుంబాలతో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

గార: బందరువానిపేట మత్స్యవానిపేట గ్రామంలో ఇటీవల జరిగిన రెండు పడవ ప్రమాదాల్లో మరణించిన ముగ్గురు మత్స్యకార కుటుంబాలను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం పరామర్శించారు. పుక్కళ్ల లక్ష్మయ్య, గుంటు గణపతి, పేర్ల గోపి కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం తరఫున త్వరితగతిన ఆర్థికసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎఫ్‌డీవో బగాతి సురేష్‌కుమార్, బర్రి రాంబాబు, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, లండ ఎర్రన్న, బడి భూదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్కల్ ఫెస్టివల్‌లో సిక్కోలు తప్పెటగుళ్లు



భోపాల్‌లో కళాకారులు

కాశీబుగ్గ: మధ్యప్రదేశ రాష్ట్రం భోపాల్‌లో జరుగుతున్న ఉత్కల్ ఫెస్టివల్‌లో ఎస్‌ఎంపురం కోరాడ బ్రదర్స్ తప్పెటగుళ్ల బృందం శుక్రవారం ప్రదర్శన ఇచ్చింది. ఆటపాటలతో అలరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

సరుబుజ్జిలి: సీజన్ మారుతున్నందున అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి వైద్యులకు సూచించారు. శుక్రవారం సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. వార్డులను పరిశీలించారు. రోగులకు స్నేహభావంతో సేవలు అందించాలన్నారు. జ్వరాలు, పాముకాటు, కుక్క కాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్‌కుమార్, సీహెచ్‌ఓ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'అమృత భారత్'తో రైల్వే స్టేషన్ల అభివృద్ధి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): అమృత భారత్ పథకం కింద దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు భారతీయ రైల్వే శ్రీకారం చుట్టిందని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. విశాఖ జిల్లా దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 1309 స్టేషన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందన్నారు. వీటిలో పలు స్టేషన్లకు సంబంధించి ఆధునీకీకరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో 25 స్టేషన్‌లు ఎంపిక కాగా, వీటిలో వాల్తేర్ డివిజన్ పరిధిలో మొత్తం 15 స్టేషన్‌లు ఉన్నాయని చెప్పారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్, దువ్వాడ, బొబ్బిలి జంక్షన్, జగదల్‌పూర్, సింహాచలం, పార్వతీపురం, చీపురపల్లి, జైపూర్, నౌపడ జంక్షన్, దమన్‌జోడి, అరకు, కోరాపుట్, కొత్తవలస, పర్లాకిమిడి స్టేషన్‌లు ఎంపికయ్యాయన్నారు. వీటిలో దువ్వాడ, విజయనగరం, దమన్‌జోడీ స్టేషన్లకు ఆదివారం ఉదయం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో భూమి పూజ చేస్తారని డీఆర్‌ఎం తెలిపారు. దువ్వాడ స్టేషన్‌ను రూ.26.31కోట్లు, విజయనగరం స్టేషన్‌ను రూ.35.16కోట్లు, దమన్‌జోడీ స్టేషన్‌ను రూ.13.93 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపికైన స్టేషన్లను సిటీ సెంటర్స్‌గా అభివృద్ధి చేస్తారు.రెండు వైపులా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేస్తారు. అత్యంత ఆధునికతతో కూడిన సదుపాయాలు కల్పిస్తారు. ల్యాండ్ స్కేపింగ్, స్థానిక కళలు, సాహిత్యం వంటి వాటిని ప్రదర్శిస్తారు.

వేర్వేరు చోట్ల నదిలో పడి ఇద్దరు మృతి




అర్జున్ (ఫైల్)




పాతపట్నం: ఘటనా స్థలంలో మృతదేహం

పాతపట్నం: జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు నదిలో పడి మృతిచెందారు. పాతపట్నం మండలం కాగువాడ గ్రామానికి చెందిన అర్జున్ పోల్‌లై (52) ఈ నెల 3న స్నానానికి మహేంద్ర నదికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయాడు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కిందికి కొట్టుకుపోయాడు. ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ 4న సీది కమలమ్మ కొట్టు సమీపంలోని బ్రిడ్జికి కూతవేటు దూరంలో మృతదేహం తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. భార్య ఘష్యాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు.

నదిలో జారిపడి వ్యక్తి మృతి



గార: కళింగపట్నం తీరం వద్ద మృతదేహం



అప్పన్న(ఫైల్)

గార మండల కేంద్రం గార పంచాయతీ కుమ్మరిపేటకు చెందిన కుమ్మరి అప్పన్న (26) వంశధార నదివద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి కాలు జారిపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార కొత్తబ్రిడ్జి వద్ద కుమ్మరిపేట గ్రామస్తులు ఎక్కువగా స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకుంటుంటారు. ఈ క్రమంలో అప్పన్న గురువారం సాయంత్రం నదివద్దకు వెళ్లగా కాలుజారి పడ్డాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని కళింగపట్నం గ్రామస్తులు గుర్తించి పోలీసులుకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెళ్లి గుర్తించారు. మృతుడి తండ్రి శిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలుగు చంద్రమోహన్ తెలిపారు. అప్పన్నకు భార్య స్వాతి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

విద్యార్థినుల ఆచూకీ కోసం మూడు బృందాలు



విచారణ చేస్తున్న సమగ్ర శిక్షా అధికారులు

బూర్జ: మండలంలోని కొల్లివలస కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం రాత్రి ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థినులు అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సమగ్ర శిక్షా సిబ్బంది కేజీబీవీకి వచ్చి ఆరా తీశారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి మూడు బృందాలు విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వెళ్తున్నట్లు ఎస్సై బి.అశోక్‌బాబు తెలిపారు. సమగ్ర శిక్షా సిబ్బంది జీసీడీఓ ఎస్.నీరజ, ఏఎస్‌ఓ సీహెచ్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కె.గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలను తిలకించాలి



మొక్కలు నాటుతున్న జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

లావేరు: ప్రతిఒక్కరూ జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలను తిలకించాలని జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. లావేరు మండలం అదపాక హైస్కూల్‌లో శుక్రవారం యువ పర్యాటక క్లబ్ ఏర్పాటు చేశారు. ముందుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వంద వరకూ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని జిల్లా వాసులు తిలకించి ఇతర ప్రాంతాల వారికి తెలియజేయాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రసాదరావు, ఇంటాక్ అదనపు కన్వీనర్ వి.జగన్నాథంనాయుడు, హైస్కూల్ పి.శ్రీనివాసరావు, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి సత్యనారాయణ, ఏపీఎస్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ ఎం.వి.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిగరెట్ నిల్వలు పట్టివేత



దుకాణం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : ప్రభుత్వ అనుమతులు లేని సిగరెట్ల అక్రమ నిల్వలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి (విజిలెన్సు జేడీ) ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం శ్రీకాకుళం, పొందూరు, నరసన్నపేట పట్టణాల్లో పలు వ్యాపార నిల్వలపై జేడీ ఆధ్వర్యంలోని విజిలెన్సు అధికారులు దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్టు వద్ద అమ్మానాన్న కిరాణా జనరల్ స్టోర్, నరసన్నపేటలో తంగుడు గణపతిరావు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉన్న రూ. 4,40,529 విలువైన అనుమతులు లేని నాసిరకం సిగరెట్లను స్థానిక పోలీసుల సహకారంతో అధికారులు పట్టుకున్నారు. సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, సతీష్‌కుమార్, ఎస్‌ఐ అశోక్, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పాల్గొన్నారు.